క్లుప్తంగా

అనధికార లేఅవుట్ తొలగింపు



నెహ్రూ నగర్: గుంటూరు నగరంలో నగరపాలక సంస్థ నుంచి అనుమతులు తీసుకోకుండా ఏర్పాటు చేసే వెంచర్లు, లే అవుట్స్‌ని తొలగిస్తామని, ప్రజలు అనుమతి పొందిన వెంచర్లలోనే స్థలాలు కొనుగోలు చేయడం ద్వారా భవిష్యత్ లో సమస్యలు రాకుండా ఉంటాయని నగర కమిషనర్ కీర్తి చేకూరి విజ్ఞప్తి చేశారు. కమిషనర్ ఆదేశాల మేరకు శుక్రవారం నగర పరిధిలోని నల్లపాడు రోడ్‌లోని ఆదర్శ నగర్ ప్రాంతాల్లో అనుమతి లేకుండా ఏర్పాటు చేసిన ప్రైవేట్ వెంచర్ హద్దు రాళ్లు, మార్కింగ్, రోడ్లను పట్టణ ప్రణాళిక అధికారులు తొలగించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో ఎక్కడా అనధికార లే అవుట్ ఉండడానికి వీలులేదని, ప్రభుత్వ నిర్దేశిత చెక్ లిస్ట్ మేరకు దరఖాస్తు చేసే లే అవుట్స్‌కి వేగంగా అనుమతులు మంజూరు చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఏసీపీలు అజయ్ కుమార్, టీపీఎస్ సువర్ణ కుమార్ పాల్గొన్నారు.

ముగిసిన శ్రీ మద్భగవద్గీత ధారావాహిక ప్రవచనాలు



నగరంపాలెం: స్థానిక బృందావన్‌గార్డెన్ శ్రీవెంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణం అన్నమయ్య కళావేదికపై నాలుగు రోజులుగా నిర్వహిస్తోన్న శ్రీ మద్భగవద్గీతలోని అక్షర బ్రహ్మయోగంపై ఆధ్యాత్మిక ప్రవచనాల కార్యక్రమాలు ముగిశాయి. మాటూరి జగన్మోహనరావు, చెన్నలక్ష్మి దంపతుల సౌజన్యంతో ప్రవచనాలు నిర్వహిస్తుండగా, ఆలయ అధ్యక్షులు సిహెచ్.మస్తానయ్య, సహాయ కార్యదర్శి ఊటుకూరి నాగేశ్వరరావు జ్యోతి ప్రజ్వలన చేశారు. చిన్మయ మిషన్ బ్రహ్మచారి సువీరానందస్వామి (చిన్మయ మిషన్) ప్రసంగిస్తూ శ్రీకృష్ణ పరమాత్మ అర్జునితో సకామకర్మయోగులను క్రమంగా అభిమాన దేవతలు స్వర్గాదిలోకాలకు చేర్చుతారని అన్నారు. శుక్ల, కృష్ణ మార్గాలని, ఈ రెండు మార్గాలు వ్యవహార ప్రసిద్ధి కలదని పేర్కొన్నారు.

నేత్ర దానంతో వేరొకరి జీవితానికి వెలుగు నిచ్చారు...



గుంటూరు మెడికల్: తన జీవితం ముగిసిన గాని మరో రెండు జీవితాలకు వెలుగు నివ్వాలని ఆలోచనతో ఎంతో మందికి ఆదర్శంగా నిలిచారు. వివరాలు.. గుంటూరు వెంగయ్యనగర్‌కి చెందిన వేముల నాగేశ్వరావు(60) కిడ్నీ సమస్యతో గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రిలో ఈ నెల 13న అడ్మిట్ అయ్యారు. రెండు రోజుల పాటు వెంటిలేటర్ మీద చికిత్స తీసుకోని 15న మరణించారు. మృతుడి కుటుంబ సభ్యులు ఆయన నేత్రాలను ఎల్వీ ప్రసాద్ ఐ బ్యాంకుకి దానం చేసి మరొక రెండు జీవితాలకు వెలుగు నిచ్చారు. ఒక పక్క తండ్రిని కోల్పోయి కూడా నేత్ర దానం చేసి ఎంతో మందికి ఆదర్శంగా నిలిచారు. పలువురికి ఉపయోగపడాలనే ఉద్దేశంతో నేత్రాలను దానం చెయ్యడం జరిగిందని పెద్ద కుమారుడు తిరుమల వెంకటేశ్వర రావు తెలిపారు.

తప్పిపోయిన బాలుడు..



గుంటూరు ఈస్ట్: తల్లిదండ్రుల నుంచి తప్పిపోయి జీజీహెచ్‌లో ఒంటరిగా తిరుగుతున్న బాలుడిని కొత్తపేట పోలీసులు చైల్డ్ వెల్ఫేర్ అధికారులకు బాలుడిని అప్పగించారు. శుక్రవారం తొమ్మిది సంవత్సరాల వయస్సు ఉన్న షేక్ అబ్దుల్ బాసిత్ జీజీహెచ్‌లో ఒంటరిగా తిరుగుతున్నాడు. గమనించిన స్థానికులు బాలుడిని కొత్తపేట పోలీసులకు అప్పగించారు. బాలుడు తల్లిపేరు షరీఫా అని, విజయవాడలోని సుందరయ్యకాలనీలో నివాసం ఉంటున్నట్లు చెబుతున్నాడు. అయితే తండ్రి పేరు చెప్పలేకపోయాడు. ఫొటోలోని బాలుడిని గుర్తించిన వారు 8688831320, 1098కు సమాచారం ఇవ్వాలని కోరారు.

ఎక్సరే సెంటర్‌లో చోరీ



గుంటూరు ఈస్ట్: ఎక్సరే సెంటర్‌లో చోరీ ఘటనపై కొత్తపేట పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలు.. కొత్తపేటలోని న్యూ భారతీ ఎక్సరే సెంటర్‌లో గురువారం రాత్రి చోరీ ఘటన చోటుచేసుకుంది. శుక్రవారం ఉదయం ఎక్సరే సెంటర్ నిర్వాహకుడు నాగభూషణం తలుపు తాళాలు పగులగొట్టి ఉండటం గమనించి లోపలకు వెళ్లి పరిశీలించగా రూ.10.30 లక్షలు చోరీకి గురైనట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. క్లూస్ టీమ్, ఎస్‌హెచ్‌ఓ అన్వర్ బాషా ఘటనా స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నల్లచెరువు వాకింగ్ ట్రాక్‌పై ఉదాసీనత!



అధ్వానంగా ఉన్న వాకింగ్ ట్రాక్



నల్లచెరువు చుట్టు పెరిగిపోయిన చొప్ప

- అధ్వానంగా మారిన పరిసరాలు
- నడకకు ఇబ్బందిగా మారిన గడ్డి

గుంటూరు ఈస్ట్: ప్రస్తుతం ప్రజలు ఆహ్లాదంతో పాటు వ్యాయామానికి ప్రాధాన్యం ఇస్తున్నారు. అందుకు అనుగుణంగా పార్కులను, ఖాళీ స్థలాలను అభివృద్ధి చేయాలని ప్రజాప్రతినిధులు, అధికారులకు విజ్ఞప్తి చేస్తున్నారు. స్పందించిన పురపాలక సంఘం పార్కులను, చెరువులను అభివృద్ధి చేసేందుకు ప్రాధాన్యం ఇస్తున్నారు. అయితే కొన్ని ప్రాంతాల్లో అవకాశం ఉన్నా పట్టించుకోవడం లేదనే విమర్శలున్నాయి.

నగరంలోని 14వ డివిజన్‌లో నల్లచెరువు వాకింగ్ ట్రాక్ అధ్వానంగా మారింది. గతంలో చెరువు చుట్టూ వాకర్స్‌కు ఉపయోగపడే విధంగా ట్రాక్ నిర్మించారు. ప్రజలు వినియోగించుకుంటున్నారు. అధికారుల నిర్లక్ష్యంతో ట్రాక్ పూర్తిగా దెబ్బతింది. ట్రాక్ మొత్తం ఎగుడుదిగుడుగా మారడంతో దీనిపై నడవడంతో వాకర్స్ దూరమవుతున్నారు. వర్షం పడితే నీరు నిలిచి ట్రాక్ బురదగా మారుతోంది. కొద్దిరోజుల వరకు ట్రాక్ నిరుపయోగంగా మారుతోంది. ప్రతిరోజూ సుమారు 800 మంది తెల్లవారుజామున 4 గంటల నుంచి ఈ ట్రాక్‌పై నడుస్తున్నారు. గ్రీనరీ ట్రాక్ చుట్టూ అభివృద్ధి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. చిన్న పిల్లలు ఆడుకునేందుకు పరికరాలు లేవు. ఇటీవల అన్ని పార్కులలో వ్యాయామం చేసుకునేందుకు సామగ్రి ఏర్పాటు చేస్తున్నా ఇక్కడ ఏర్పాట చేసిన దాఖలాలు కనిపించడం లేదు. ట్రాక్‌కు లైటింగ్ లేనందు వల్ల తెల్లవారుజామున, సాయంత్రం వేళల్లో నడిచేందుకు వచ్చేవారికి ఇబ్బందిగా మారింది. ట్రాక్‌పై గడ్డి, చెరువులో చొప్ప విపరీతంగా పెరిగింది. ఇటీవల ఆరోగ్యంపై ప్రజలు దృష్టి పెట్టారు. దీనికి తోడు జీవన విధానంలో మార్పు రావడంతో ప్రతి ఒక్కరూ ఎంతో కొంత వ్యాయామం చేయాలని వైద్యులు సూచిస్తున్నారు. దీంతో ప్రజలు పెద్ద సంఖ్యలో వాకింగ్ చేసేందుకు ఆసక్తి చూపుతున్నారు. పూర్తి స్థాయిలో అభివృద్ధి చేస్తే స్థానిక ప్రజలకు ఉపయోగంగా ఉంటుంది.

ట్రాక్‌ను అభివృద్ధి చేయాలి



ట్రాక్ ఎగుడు దిగుడుగా ఉండటం వలన ఎక్కువ సమయం నడవలేకపోతున్నాం. ట్రాక్ శుభ్రంగా ఉంటే నడక సాగుతుంది. ఇలా ఉంటే నడిచేవారికి కాళ్ల సమస్యలు వస్తాయి. లైటింగ్ సదుపాయం కల్పించి పూర్తి స్థాయిలో ట్రాక్‌ను అభివృద్ధి చేయాలి.

– జి.ప్రసాద్, స్థానికుడు

అభివృద్ధికి చర్యలు

ఎన్నికల కోడ్ కారణంగా వాకింగ్ ట్రాక్ అభివృద్ధి ఆగిపోయింది. రూ.30 లక్షలతో టెండరు అగ్రిమెంట్ స్టేజీలో ఉంది. ఈ ప్రక్రియ పూర్తవగానే వీలైనంత త్వరలో వాకింగ్ ట్రాక్‌ను అభివృద్ధి చేస్తాం.

– సునీల్‌కుమార్, నగరపాలక సంస్థ ఏఈ

సమస్యల పరిష్కారానికి సహకరించండి

ఎమ్మెల్యే రామాంజనేయులును కలిసిన వ్యాపారులు



ఎమ్మెల్యే రామాంజనేయులతో పలువురు వ్యాపారులు

గుంటూరు మెడికల్: శ్రీవాసవి కన్యకా కమర్షియల్ కాంప్లెక్స్ ట్రేడర్స్ వెల్ఫేర్ సొసైటీ సభ్యులు శుక్రవారం బీజేపీ జిల్లా అధ్యక్షుడు వనమా నరేంద్రకుమార్ ఆధ్వర్యంలో ప్రత్తిపాడు ఎమ్మెల్యే బూర్ల ఆంజనేయులును కలసి తమ సమస్యలపై వినతిపత్రం అందజేశారు. గుంటూరు తూర్పు నియోజకవర్గంలో ఉన్న హోల్‌సేల్ కిరాణా మర్చంట్స్, కోకోనట్ మర్చంట్స్, జనరల్ అండ్ ఫ్యాన్సీ మర్చంట్స్, టామరిండ్ మర్చంట్స్, ఆయిల్ డీలర్స్, హోల్‌సేల్ గార్లిక్ అండ్ జింజర్ మర్చంట్స్, గ్రేన్స్ అండ్ జనరల్ మర్చంట్స్, సాల్ట్ మర్చంట్స్ షాపులన్నీ కూడా గుంటూరు పశ్చిమ నియోజకవర్గం లాల్‌పురం రోడ్డులో 23 ఎకరాల ప్రాంగణంలో నూతనంగా నిర్మించిన కాంప్లెక్స్‌లోకి మారనున్నాయి. నూతన కాంప్లెక్స్‌లో నీటి సమస్య ఉందని దానిని తొలగించాని ఎమ్మెల్యేను కోరారు. సొసైటీ అధ్యక్షుడు రంగా బాలకృష్ణ, ప్రధాన కార్యదర్శి తూనుగుంట్ల నాగేశ్వరరావు, కోశాధికారి యక్కల వెంకటసుబ్బారావు, లాల్‌పురం మాజీ సర్పంచి కాటూరు శ్రీనివాసరావు తదితరులు వినతి పత్రం అందజేసిన వారిలో ఉన్నారు.

రేపు గురుపౌర్ణమి వేడుకలు

నగరంపాలెం: కొత్తపేట గణేశ్వరరావు వీధిలో కొలువైన షిరిడిసాయి ధ్యాన మందిరంలో ఈనెల 21న గురు పౌర్ణమి వేడుకలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు వేపూరి లక్ష్మీనరసింహారావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం తెల్లవారుజామున కాకడ హారతి, పంచామృత అభిషేకాలు, స్వర రాగ సుధా సాయి బృందంతో భక్తులకు ప్రవచనాలు, బాబా చాలీసా పఠనం, తీర్థప్రసాద వితరణ, లలిత సహస్రనామాలు జరుగుతాయని పేర్కొన్నారు.

భగవద్గీత ప్రవచనం..

నగరంపాలెం: ఈనెల 21న ట్రూత్ స్పిరిటుల్ ఆర్గనైజేషన్ వ్యవస్థాపకులు వివేకానంద గుంటూరు నగరానికి రాను న్నారని కమిటీ సభ్యులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కొరిటెపాడు లైబ్రరీ సెంటర్‌లోని కొమ్మినేని ఫంక్షన్ హాల్ (కొమ్మినేని గార్డెన్స్)లో సాయంత్రం 5 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు భగవద్గీత ప్రవచనం జరుగుతుందని పేర్కొన్నారు.

నేడు కులపతి ఎక్కిరాల కృష్ణమాచార్యులపై ధార్మికోపన్యాసం

గుంటూరు ఎడ్యుకేషన్: వరల్డ్ టీచర్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు కులపతి డాక్టర్ ఎక్కిరాల కృష్ణమాచార్యుల జీవితం-విశేషాలు అనే అంశంపై శనివారం మార్కెట్ సెంటర్లోని హిందూ కళాశాలలో ధార్మికోపన్యాసం నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ పి.మల్లికార్జున ప్రసాద్ శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. గురుపూర్ణిమ ఉత్సవాల్లో భాగంగా కళాశాల సమావేశ మందిరంలో శనివారం ఉదయం 11 గంటలకు జరగనున్న సభలో ప్రవచనకర్త మల్లాది కైలాసనాథ్, కులపతి ఎక్కిరాల కృష్ణమాచార్య జీవిత విశేషాలు, గురుపూర్ణిమ విశిష్టతలపై ప్రసంగిస్తారని వివరించారు.

ఖాళీ స్థలాలను శుభ్రంగా ఉంచుకోవాలి



ఖాళీ స్థలంలో చెట్లు తొలగిస్తున్న ప్రజారోగ్య సిబ్బంది

నెహ్రూ నగర్: గుంటూరు నగరంలోని ఖాళీ స్థలాల వలన ప్రజలకు అసౌకర్యం వాటిల్లుతుందని, స్థల యజమానులు స్వచ్ఛందంగా ఏడు రోజుల్లోగా స్థలాలను శుభ్రం చేసుకోవాలని, లేకుంటే ఆయా స్థలాలను జీఎంసీ స్వాధీనం చేసుకొని ప్రజా ఉపయోగ కార్యక్రమాలకు వినియోగిస్తామని నగర కమిషనర్ కీర్తి చేకూరి శుక్రవారం ఒక ప్రకటన పేర్కొన్నారు. పశ్చిమ నియోజకవర్గంలో ఎక్కువగా ఖాళీ స్థలాలు ఉన్నాయని, తద్వారా పాములు, నీరు నిల్వ ఉండడం వలనా దోమలు పెరిగి, దుర్గంధం వలన ప్రజల అనారోగ్యానికి కారణం అవుతున్నాయని ఎమ్మెల్యే గల్లా మాధవి తమ దృష్టికి తెచ్చారన్నారు. ఇప్పటికే నగరపాలక సంస్థ గతంలో అనేక పర్యాయాలు నోటీసులు ద్వారా తెలియచేయడం జరిగిందన్నారు. నగరపాలక సంస్థ ప్రజారోగ్య అధికారులు ఖాళీ స్థల యజమానులకు తుది నోటీసులు జారీ చేయాలని ఆదేశించామని, స్థల యజమానుల వివరాల కోసం రిజిస్ట్రేషన్ కార్యాలయం నుంచి సేకరిస్తామన్నారు. వారం రోజుల తర్వాత కూడా స్పందించని స్థల యజమానులకు జీహెచ్ఎంసీ యాక్ట్ 1955 సెక్షన్ 496, 504, 639, 640, 641 ప్రకారం స్థలాల్లో పిచ్చి మొక్కలను పూర్తి స్థాయిలో తొలగించాలని, నీరు నిలిచిన ప్రాంతాల్లో మట్టితో లెవల్ చేసుకోవాలని లేకుంటే జీఎంసీ బోర్డులను ఏర్పాటు చేస్తామని హెచ్చరించారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

గుంటూరు ఈస్ట్: మద్యానికి బానిసై శానిటైజర్ తాగి మృతి చెందిన ఘటనపై అరండల్‌పేట పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాలు.. శివనాగరాజుకాలనీలో నివాసం ఉండే కె.రాజు(35) భార్య వదిలి వెళ్లడంతో మద్యానికి బానిసయ్యాడు. మద్యానికి డబ్బులు లేక శానిటైజర్ తాగడం అలవాటు చేసుకున్నారు. ఎక్కువ మొత్తంలో శానిటైజర్ తాగి తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. కుటుంబ సభ్యులు రాజును రెండు రోజుల క్రితం జీజీహెచ్‌లో చేర్పించారు. చికిత్స పొందుతూ శుక్రవారం మృతిచెందాడు. మృతదేహాన్ని మార్చురీకి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఘనంగా బీటెక్ డిగ్రీల ప్రదానోత్సవం

గుంటూరు రూరల్: నాణ్యమైన విద్యను ప్రతి విద్యార్థికి అందించడమే తమ లక్ష్యమని కళ్లం ఇంజినీరింగ్ కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎం.ఉమాశంకర్‌రెడ్డి తెలిపారు. చౌడవరంలోని కళాశాలలో మొదటి సారిగా స్వయంప్రతిపత్తి హోదాలో 2023–24 విద్యా సంవత్సరంలో ఇంజినీరింగ్ పూర్తి చేసిన విద్యార్థులకు పట్టాల ప్రదానోత్సవం శుక్రవారం నిర్వహించారు. కార్యక్రమంలో డైరెక్టర్ మాట్లాడుతూ.. ఉన్నత ప్రమాణాలతో కూడిన విద్యా విధానం తమ కళాశాల ప్రత్యేకత అని తెలిపారు. కాకినాడ జేఎన్‌టీయూ ప్రొఫెసర్, డైరెక్టర్ ఆఫ్ ఎవాల్యుయేషన్ బి.బాలకృష్ణ మాట్లాడుతూ.. ప్రతి విద్యార్థి లక్ష్య సాధన దిశగా కృషి చేయాలన్నారు. కళాశాల చైర్మన్ కళ్లం మోహన్‌రెడ్డి మాట్లాడుతూ.. కళాశాల స్థాపించిన 11 సంవత్సరాలలో ఎన్‌బీఏ, నాక్ ఏ గ్రేడ్, స్వయం ప్రతపత్తిని సాధించడంతోపాటు ఈ పట్టా ప్రదానోత్సవం నిర్వహించడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ బీఎస్‌బీ రెడ్డి ఈ సందర్భంగా విద్యార్థులకు అభినందనలు తెలిపారు. వ్యక్తిగత ఉన్నతితోపాటు సమాజంలోనూ మంచి గుర్తింపు పొందాలని ఆకాంక్షించారు. అనంతరం 700 మందికి పట్టాలను ప్రదానం చేశారు. విద్యార్థులు తెలుగుదనం ఉట్టిపడే వేషధారణలో డిగ్రీ పట్టాలను స్వీకరించి ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు.

అడిగోపుల మృతికి సంతాపం

నగరంపాలెం: ప్రముఖ కవి, ఆంధ్రప్రదేశ్ రచయితల సంఘం గౌరవ సలహాదారు అడిగోపుల వెంకటరత్నం మృతికి ఆంధ్రప్రదేశ్ రచయితల సంఘం శుక్రవారం ఒక ప్రకటనలో సంతాపం తెలిపింది. అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన శుక్రవారం తిరుపతిలో తుదిశ్వాస విడిచినట్లు ఆంధ్రప్రదేశ్ రచయితల సంఘం ప్రధాన కార్యదర్శి చలపాక ప్రకాష్, కార్యదర్శి ఎస్ఎం సుభాని పేర్కొన్నారు. తెలుగు సాహిత్య రంగంలో తనదైన సంతకంతో అశేష కృషి చేశారని, అడిగోపుల లేని లోటు పూడ్చలేనిదని అన్నారు. సంఘం ప్రారంభం నుంచి గౌరవ సలహాదారుగా ఉంటూ సలహాలు, సూచనలతో తనదైన సేవలను అందించడం మరువలేనిదని పేర్కొన్నారు.

మున్సిపల్ ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

ఎంఈఓకు ఎస్టీయూ విజ్ఞప్తి



ఎంఈఓ రమణయ్యకు వినతి పత్రం అందజేస్తున్న ఎస్టీయూ నాయకులు

గుంటూరు ఎడ్యుకేషన్: మున్సిపల్ ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న అపరిష్కృత సమస్యలను పరిష్కరించాలని రాష్ట్రోపాధ్యాయ సంఘం(ఎస్టీయూ) నగర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.వెంకయ్య, ఉగ్గం మహంకాళ రావు పేర్కొన్నారు. గుంటూరు అర్బన్, రూరల్ మండల విద్యాశాఖాధికారిగా(ఎంఈఓ-1) బాధ్యతలు స్వీకరించిన బీవీ రమణయ్యను ఎంఈవో కార్యాలయంలో కలసిన ఎస్టీయూ నాయకులు ఆయనకు అభినందనలు తెలిపి, సమస్యలతో కూడిన వినతి పత్రం సమర్పించారు. మున్సిపల్ ఉపాధ్యాయుల సర్వీసు రిజిస్టర్‌లను అప్‌డేట్ చేసి, ఆదాయ పన్నుకు సంబంధించిన టీడీఎస్ మినహాయింపు సత్వరమే పూర్తి చేయాలని కోరారు. మిగులు ఉపాధ్యాయులను అవసరమైన పాఠశాలలకు సర్దుబాటు చేయడంతో పాటు విద్యార్థుల సంఖ్యను పరిగణలోకి తీసుకునే అంశాలపై ఎంఈఓ దృష్టికి తీసుకెళ్లారు. ఎంఈఓను కలిసిన వారిలో ఎస్టీయూ రాష్ట్ర, జిల్లా నాయకులు కె.విజయబాబు, వై.శ్యాంబాబు, వి.శ్రీనివాసరావు, డీవీ సుబ్బారావు, సీహెచ్ జయ సుందర్, జి.అప్పలనారాయణ, కె.విజయకుమార్, హరినాథ్, కె.అనిల్‌కుమార్, ఎన్.శ్రీనివాసరావు, ఆర్.రామనరసయ్య ఉన్నారు.

నగరంలో సిటీ బస్సులు నడపాలని వినతి

నెహ్రూనగర్: గుంటూరు నగరంలో సిటీ బస్సులు తిప్పాలని నగరానికి చెందిన శ్రీనివాసరావు గుంటూరు 2 డిపో మేనేజర్ ఎస్.కె.అబ్దుల్ సలాం దృష్టికి తీసుకెళ్లారు. శుక్రవారం డిపోలో డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహించారు. స్పెషల్ సర్వీస్‌లలో మంత్లీ సీజన్ పాసులు అనుమతించడం లేదని, స్త్రీలకు కేటాయించిన సీట్లలో వారిని కూర్చునే విధంగా తగిన చర్యలు చేపట్టాలని లాల్ పురాణ చెందిన లక్ష్మీనారాయణ విన్నవించారు. గుంటూరు నుంచి ముట్లూరుకు కేటాయించిన సమయానికి బస్సులు రావడం లేదని, సమయం ప్రకారం బస్సులు నడపాలని ముట్లూరు చెందిన జయపాల్ విజ్ఞప్తి చేశారు. సిటీ బస్సు సర్వీసుల ప్రతిపాదనను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్తామని హామీ ఇచ్చారు. బస్సులను షెడ్యూల్ ప్రకారం నడపడానికి తగిన ఆదేశాలు సిబ్బందికి ఇస్తామని చెప్పారు.

ఉపాధ్యాయులపై సస్పెన్షన్ ఎత్తివేయాలి

గుంటూరు ఎడ్యుకేషన్: పెదకాకాని మండలం యాదవపాలెం ప్రాథమిక పాఠశాలలో పని చేస్తున్న నలుగురు ఉపాధ్యాయులపై విధించిన సస్పెన్షన్ ఎత్తివేయాలని ఏపీటీఎఫ్ గుంటూరు జిల్లా శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.బసవలింగారావు, మహమ్మద్ ఖాలీద్ శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. అల్పాహారం చేసేందుకు ఇంటికి వెళ్లొస్తానని ప్రధానోపాధ్యాయుడి వద్ద అనుమతి తీసుకునేందుకు వెళ్లిన ఐదో తరగతి విద్యార్థినికి అనుమతి నిరాకరించినప్పటికీ, తరగతి గదికి వెళ్లినట్లే వెళ్లిన సదరు విద్యార్థిని ఉపాధ్యాయులకు చెప్పకుండా పాఠశాల నుంచి బయటకు వెళ్లిందని తెలిపారు. పాఠశాల ప్రహరీ దూకి బయటకు వెళ్లిన విద్యార్థిని తలకు గాయం కావడం దురదృష్టకరమన్నారు. విద్యార్థుల భద్రతను దృష్టిలో ఉంచుకుని ఉపాధ్యాయులు పని చేస్తుండగా, అనుకోని ఘటన తీవ్ర మనోవేదనకు గురిచేసిందన్నారు. జరిగిన ఘటనలో ప్రత్యక్షంగా ప్రమేయం లేకున్నప్పటికీ మొత్తం నలుగురు ఉపాధ్యాయులను బాధ్యులని చేసి సస్పెండ్ చేయడంతో ఆత్మస్థైర్యం దెబ్బతిని, నిబ్బరం కోల్పోయారన్నారని పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్, జిల్లా విద్యాశాఖాధికారి ఉపాధ్యాయులపై సానుభూతితో వ్యవహరించి, సస్పెన్షన్ ఎత్తివేయాలని కోరారు.

పోలీస్ సంక్షేమానికి కృషి

జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్



జిల్లా ఎస్పీకి పుష్పగుచ్ఛం అందిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ హెనీక్రిస్టినా

నగరంపాలెం: జిల్లాలో విధులు నిర్వర్తించే పోలీస్ అధికార, సిబ్బంది పలు సమస్యలతో జిల్లా పోలీస్ కార్యాలయం (డీపీఓ)నకు వస్తారని, వారి సమస్యలను పరిష్కరించేలా చర్యలు చేపట్టాలని జిల్లా ఎస్పీ ఎస్.సతీష్ కుమార్ మినిస్టీరియల్ సిబ్బందికి సూచించారు. ఇటీవల జిల్లా ఎస్పీగా బాధ్యతలు చేపట్టిన ఆయన్ను శుక్రవారం డీపీఓలోని ఏ సెక్షన్, బీ సెక్షన్, సీ సెక్షన్ ఏఓ, సూపరింటెండెంట్‌లు మర్యాద పూర్వకంగా కలిశారు. ఎస్పీ మాట్లాడుతూ పోలీస్ అధికార, సిబ్బంది సంక్షేమం కోసం ఐక్యతతో విధులు నిర్వర్తించాలని అన్నారు. ఏఓ వేంకటేశ్వరరావు, హిమవంతరావు, శంకరరావు, సందాని బాషా, షరీఫ్, బాషా పాల్గొన్నారు. జిల్లా ఎస్పీ ఎస్.సతీష్‌కుమార్‌ను శనివారం జిల్లా పోలీస్ కార్యాలయంలో జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీక్రిస్టినా మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు.

వర్షాల నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలి

పశ్చిమ ఎమ్మెల్యే గల్లా మాధవి



అధికారులతో సమావేశమైన ఎమ్మెల్యే మాధవి, కమిషనర్ కీర్తి చేకూరి

నెహ్రూ నగర్: వర్షాకాలం ప్రజలకు ఇబ్బందులు లేకుండా తగిన చర్యలు తీసుకోవాలని పశ్చిమ ఎమ్మెల్యే గల్లా మాధవి కోరారు. శుక్రవారం నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలో నియోజకవర్గంలో జరుగుతున్న, చేపట్టాల్సిన అభివృద్ధి పను లు, ఇంజినీరింగ్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ క్షేత్ర స్థాయి పర్యటనల్లో ప్రజల స్థానిక సమస్యలు పరిష్కరించడానికి ప్రతిపాదించిన పనులను వెంటనే చేపట్టా లని సూచించారు. ఏటీ అగ్రహారం రోడ్ విస్తరణ పనులు త్వరగా పూర్తి చేయాలని చెప్పారు. దీని వ లన ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. పీకలవాగుకు రిటైనింగ్ వాల్ నిర్మాణం చేయాల్సిన అవసరం ఉందన్నారు. కాలువల్లో తీస్తున్న సిల్ట్ ని వెంటనే తొలగించకపోవడం వలన మళ్లీ అది కాలువలోనే పడుతుందన్నారు. అలాగే అనేక ప్రాంతాల్లో భవన నిర్మాణ వ్యర్థాలు రోడ్లపై ఉంటున్నాయని, వాటిని తొలగించడానికి కార్యాచరణ సిద్ధం చేయాలన్నారు. నియోజకవర్గంలోని పార్కులు, వాకింగ్ ట్రాక్‌ల అభివృద్ధిపై వివరాలు ఇవ్వాలన్నారు. కమిషనర్ కీర్తి చేకూరి మాట్లాడుతూ గుంటూరు నగరంలో ప్రస్తుతం వర్షాలు కురుస్తున్నందున ప్రజల రాకపోకలకు ఆటంకం లేకుండా ప్రధాన రహదార్లకు ప్యాచ్ వర్కులు తక్షణం చేపట్టాలని ఆదేశించారు. ప్రజా ప్రతినిధుల క్షేత్ర స్థాయి పర్యటనల్లో సంబంధిత అధికారులు కూడా పాల్గొని, పర్యటనలో గుర్తించిన సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని చెప్పారు. వర్షాల కారణంగా ప్రధాన రహదారుల్లో ఏర్పడిన గుంతలకు వాహనాల రాకపోకలకు ఆటంకంగా ఉన్న ప్రాంతాల్లో తక్షణం తాత్కాలికంగా ప్యాచ్ వర్కులు చేపట్టాలని, వర్షాకాలం అనంతరం శాశ్వత పరిష్కారంగా రోడ్ల ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. పశ్చిమలో వివిధ అభివృద్ధి పనులకు టెండర్ పొందిన కాంట్రాక్టర్లు నిర్దేశిత గడువులో పనులు ప్రారంభించాలని, లేకుంటే వారికి నోటీసులు జారీ చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఏఈలకు స్పష్టం చేశారు. హౌసింగ్ బోర్డ్ కాలనీలోని యూజీడీ సెప్టిక్ ట్యాంక్ స్థానంలో నూతన ట్యాంక్ నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని చెప్పారు. సమావేశంలో ఎస్ఈ శ్యాం సుందర్, ఈఈలు సుందర రామిరెడ్డి, కొండారెడ్డి, ఏడీహెచ్ రామారావు, డీఈఈలు రమేష్ బాబు, మహ్మద్‌రఫిక్, కల్యాణరావు, శివకుమార్ పాల్గొన్నారు.

పూడిక తీత పనులు చేపట్టాలి

నగరంలో పూడిక తీత జరగని ప్రాంతాల్లో తక్షణమే తీయించాలని, తీసిన పూడికను ఎప్పటికప్పుడు తరలించాలని నగర కమిషనర్ కీర్తి చేకూరి, ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కేవీపీ కాలనీ, పట్టాభిపురం, స్తంభాల గరువు, భాగ్య నగర్, తుఫాన్ నగర్ ప్రాంతాల్లో పర్యటించారు.

బ్యాంకులను ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాలి

ఘనంగా బ్యాంకుల జాతీయకరణ దినోత్సవం



ఏఐబీఈఏ పతాకాన్ని ఆవిష్కరించి మాట్లాడుతున్న కిషోర్‌కుమార్, రామారావు, సయ్యద్ బాషా తదితరులు

కొరిటెపాడు(గుంటూరు): బ్యాంకుల జాతీయకరణ దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. హిందూ కళాశాల యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా శాఖ వద్ద ఏఐబీఈఏ పతాకాన్ని ఇండియన్ బ్యాంక్ ఉద్యోగ సంఘ నాయకుడు రామారావు ఆవిష్కరించారు. జిల్లా బ్యాంక్ ఉద్యోగుల సమన్వయ సంఘం సలహాదారు పి.కిషోర్‌కుమార్ మాట్లాడుతూ 1969 జూలై 19న నాటి ప్రధానమంత్రి ఇందిరాగాంధీ 14 బ్యాంకులను జాతీయం చేసినట్లు చెప్పారు. భా రత దేశ చరిత్రలో ఇదొక ప్రధాన ఘట్టమన్నారు. బ్యాంకింగ్ సౌకర్యాలు పట్టణాల నుంచి గ్రామీణ ప్రాంతాలకు విస్తరించిందని చెప్పారు. కానీ 1991 తర్వాత వచ్చిన ప్రభుత్వాలు ఆర్థిక సంస్కరణల పేరుతో ప్రభుత్వ రంగ బ్యాంకులను నిర్వీర్యచేస్తూ ప్రైవేటుబ్యాంక్‌లను సమర్థిస్తోందని ఆరోపించారు. ఇప్పటికే ప్రభుత్వ రంగ బ్యాంకులలో రాజకీయ జోక్యంతో నిరర్థక ఆస్తులు విపరీతంగా పెరగడం ఈ పది సంవత్సరాలలో రూ.లక్షల కోట్లు మాఫీ చేయడం జరిగిందని తెలిపారు. ప్రజలు వ్యవసాయ రుణాల మాఫీ అడుగుతుంటే కార్పొరేట్ రుణాల మాఫీ ప్రభుత్వం చేపడుతోందని విమర్శించారు. ఈ రోజు భారతదేశంలోని బ్యాంకులలో ఉన్న రూ.225 లక్షల కోట్లు ప్రజాధనం సురక్షితంగా ఉండాలంటే బ్యాంకులన్నీ ప్రభుత్వ రంగంలోనే కొనసాగాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు. రుణ ఎగవేతదారులైన బడా పెట్టుబడీ వర్గాల మీద క్రిమినల్ కేసులు పెట్టి వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. బ్యాంకులలో వెంటనే ఉద్యోగ నియామకాలు చేపట్టాలని కోరారు. సామాన్యులు పొదుపు చేసుకొనే సేవింగ్స్ బ్యాంకు అకౌంట్స్‌కు ఇచ్చే వడ్డీ రేట్లు పెంచాలన్నారు. రాబోయే రోజుల్లో ప్రభుత్వం తీసుకొనే ప్రజా వ్యతిరేక నిర్ణయాలను వ్యతిరేకిస్తూ ఏఐబీఈఏ ద్వారా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి బాషా, యూనియన్ నాయకులు మురళీ, రవీంద్రా రెడ్డి, శివాజీ, షరీఫ్, క్రాంతి, పావని, పృధ్వీ, రామకృష్ణ, కుమార్ పాల్గొన్నారు.

చిరుద్యోగులపై వేధింపులు ఆపాలి

సీఐటీయూ డిమాండ్



మాట్లాడుతున్న సీఐటీయూ నాయకులు

లక్ష్మీపురం: చిరుద్యోగులపై వేధింపులు తగదని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు దండా లక్ష్మీనారాయణ, జిల్లా ప్రధాన కార్యదర్శి వై.నేతాజి పేర్కొన్నారు. స్థానిక బ్రాడీపేటలోని సీఐటీయూ కార్యాలయంలో శుక్రవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ కూటమి గెలుపులో రాష్ట్రంలోని కార్మికులు, ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్, స్కీమ్ వర్కర్లు, చిరు ఉద్యోగులకు పాత్ర గణనీయమైందని గుర్తు చేశారు. అధికారంలోకి వచ్చిన తరువాత ఉమ్మడి గుంటూరు జిల్లాలో కొంత మంది అంగన్‌వాడీలను 'మీరు రాజీనామాలు చేయమని, అప్పటి వరకు విధుల్లో రావటానికి వీల్లేదని' వేధింపునకు గురిచేస్తున్నారని ఆరోపించారు.

కాంట్రాక్టు ఉద్యోగులకు ఎలాంటి నోటీసు ఇవ్వకుండా నోటి మాటగా ఉద్యోగాల నుంచి తొలగించడం దారుణమన్నారు. యానిమేటర్లను తొలగించేందుకు ప్రభుత్వ అధికారులు స్వయంగా పోలీసులను వెంటబెట్టుకొని గ్రామాలకు వెళ్లి డ్వాక్రా మహిళలతో బలవంతంగా సంతకాలు చేయించి యానిమేటర్లను తొలగించినట్లు తీర్మానాలు రాస్తున్నారని పేర్కొన్నారు. ఇలాంటి చర్యలన్నీ చట్టవ్యతిరేకమైనవని, వీటన్నిటిని తక్షణమే నిలుపుదల చేయాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే తొలగించిన ఉద్యోగులందరినీ తిరిగి విధుల్లోకి తీసుకోవాలని కోరారు. మానిఫెస్టోలో కార్మికులు, ఉద్యోగులు, చిరుద్యోగులకు ఇచ్చిన హామీలు నెరవేర్చే విధంగా చర్యలు చేపట్టాలని విన్నవించారు. ఈ విషయాలపై జిల్లాలోని ప్రజాప్రతినిధులు అందరికీ సీఐటీయూ ఆధ్వర్యంలో విజ్ఞాపన పత్రాలు అందించనున్నట్లు తెలిపారు. తమ ఉద్యోగాలు, హక్కులు నిలబెట్టుకునేందుకు ఆయా సంఘాల ఆధ్వర్యంలో చిరుద్యోగులు చేసే పోరాటాలకు సీఐటీయూ ప్రత్యక్షంగా మద్దతు ఇస్తుందన్నారు. సమావేశంలో జిల్లా కార్యదర్శి బి. లక్ష్మణరావు, నగర తూర్పు, పశ్చిమ కమిటీల ప్రధాన కార్యదర్శులు కట్లగుంట శ్రీనివాసరావు, బి. ముత్యాలరావు పాల్గొన్నారు.